క్రీడాకారులకు అభినందన

రజత,కాంస్య పతకాలను సాధించిన క్రీడాకారులను అభినందించిన సురేశ్ తదితరులు

హిమాయత్ నగర్, అక్టోబర్ 5 : పుదుచ్చేరిలోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగిన 3వ నేషనల్ ప్లోర్ కర్లింగ్ ఛాంపియన్ షిప్-2024 పోటీల్లో తెలంగాణ నుంచి మిక్స్‌డ్ డబల్స్‌లో పాల్గొన్న లయన్ వి.వసంత మాధురి, టి.అనుదీప్‌రెడ్డి కాంస్య పతకాలను కైవసం చేసుకోవడం పట్ల కర్లింగ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ రొయ్యూరు సురేశ్ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సీనియర్ ఉమెన్స్ టీంలో పాల్గొన్న వసంత మాధురి, ఎం.నాగ అక్షయ, ఎం.లక్ష్మి చైతన్య, మేజర్ పద్మజ రజత పతకాలను సాధించారు. కర్లింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి మహ్మద్ డ్యానిష్, టెక్నికల్ డైరెక్టర్ పి.ఎన్.రాజు క్రీడాకారులను అభినందించారు.

పోస్టర్ ఆవిష్కరణ

హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

హిమాయత్ నగర్, అక్టోబర్ 5 : దేశంలోని యువత సామర్థ్యాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర విమర్శించారు. ఈ నెల 27,28 తేదీల్లో పెద్దపల్లి జిల్లా, గోదావరిఖనిలో జరిగే రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌కు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరణ శనివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ సమస్య జఠిలమవుతుందని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కాలయాపన చేయడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ ముందుకు పోవడంలేదన్నారు. ఉపాధి ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయకుండా ఉద్యోగ అవకాశాలను ప్రభుత్వాలు కల్పించలేని పరిస్థితి ఉందన్నారు. వర్క్‌షాప్‌కు యువత అధిక సంఖల్లో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర నేతలు వెంకటేశ్వర్లు, కునుకుంట్ల శంకర్, శ్రీనివాస్, టి.సత్యప్రసాద్,యుగంధర్ పాల్గొన్నారు.

లలితా త్రిపురసుందరిగా అమ్మవారు



మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గోపీనాథ్

ఎర్రగడ్డ, అక్టోబర్ 5 : దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారు లలితా త్రిపురసుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బోరబండ డివిజన్ హరిహర క్షేత్ర ప్రాంగణంలో శనివారం జరిగిన పూజలో ఆలయ ధర్మకర్త సత్యనారాయణ, బస్తీవాసులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ : దేవినవరాత్రోత్సవాల సందర్భంగా జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో కన్య పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం దోమలగూడలోని ఆయన నివాసంలో నిర్వహించిన ఈ పూజలకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విష్ణువర్ధన్ రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు యూసుఫ్‌గూడ.. వెంగళరావునగర్ డివిజన్‌ల కార్పొరేటర్లు రాజ్‌కుమార్ పటేల్, దేదీప్య, బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి : మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్ డివిజన్ పరిధిలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. దేవాలయాల వద్ద ప్రతిష్ఠించిన అమ్మవారికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పలు సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. అన్నదాన కార్యక్రమాల్లో స్థానిక ప్రాంతాలకు చెందిన ప్రజలు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కాటేదాన్‌లోని దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు

బోరబండ హరిహర క్షేత్రంలో అమ్మవారి పూజలో పాల్గొన్న భక్తులు

బతుకమ్మ కుంటను శుభ్రపరచండి

అధికారులతో కలిసి బతుకమ్మ కుంటను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దేదీప్య

వెంగళరావునగర్,అక్టోబర్5 : గుర్రపుడెక్కతో నిండిఉన్న బతుకమ్మ కుంటను వెంటనే శుభ్రపరచాలని వెంగళరావునగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ అధికారులను ఆదేశించారు. బతుకమ్మ పండుగ 5 రోజులు కావస్తున్నా బతుకమ్మ కుంట పరిశుభ్రపరచలేదని.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బతుకమ్మ పండుగకు ముందే శుభ్రపరిచే వాళ్లని గుర్తుచేశారు. శనివారం డీసీ జాకియాసుల్తానా, ఈఈ రాజ్‌కుమార్, డిప్యూటీ ఈఈ రామచంద్రరాజు, ఏఎంఓహెచ్ సాల్మన్, ఏఈ అవినాష్‌లతో కలిసి యూసుఫ్‌గూడ కృష్ణకాంత్ పార్కులో పర్యటించి బతుకమ్మ కుంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూజారి బాల్‌రాజు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా చూడాలి

బృందావన్ కాలనీలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 5: భారతదేశ ప్రధానిగా నరేంద్ర మోదీ దేశాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు అహర్నిశలు కష్టపడి పని చేస్తున్నారని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలను కలుసుకొని వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లోని ప్రతి బూత్‌లో 400 మంది చొప్పున డివిజన్ వ్యాప్తంగా 20 వేల సభ్యత్వాన్ని టార్గెట్ చేసుకోవాలన్నారు. బీజేపీ పార్టీలో చేరడానికి యువత సిద్ధంగా ఉన్నారన్నారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పార్టీని ఆదరించి మంచి మెజార్టీని అందించారని గుర్తు చేశారు. ఏ స్ఫూర్తితో పాటు మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరే విధంగా ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలన్నారు. స్థానిక సంస్థలు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అడికే జనార్దన్, బూత్ కోఆర్డినేటర్, పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్

జూబ్లీహిల్స్, అక్టోబర్ 5 : సీఎం రిలీఫ్ ఫండ్ ఆపదలో ఉన్న పేదలను ఆదుకుంటుందని యూసుఫ్‌గూడ డివిజన్ కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్ అన్నారు. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆదేశాల మేరకు శనివారం డివిజన్‌లోని శ్రీకృష్ణానగర్ ఎ,బి,సి బ్లాక్‌లతో పాటు లక్ష్మీనరసింహానగర్‌కు చెందిన 14 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3.80 కోట్ల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సంతోష్ ముదిరాజ్, కార్యదర్శి ఐలపాక నర్సింగ్‌దాస్, నాయకులు కైసర్ జహాన్, గీతా గౌడ్, స్రవంతి, అమ్మాజీ, అరుణ, రత్నకుమారి, రమాదేవి, రేణుక, ప్రసన్న, అశోక, సీహెచ్.సాయిలక్ష్మి, రజిని, భాగ్యలక్ష్మి, బసవరాజు, వేణుగోపాల్, నాగరాజు, అజర్, బాబీ, శరత్, గణేశ్, ధర్మారావు, నాగ, హసన్, రాజు, శైలేశ్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఉపాధ్యాయులకు సన్మానం

ఆదర్శ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షులు రమేశ్‌రెడ్డి తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 5: విద్యార్థులకు బంగారు భవిష్యత్ అందించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి ఎంతో గొప్పదని నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆదర్శ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఉపాధ్యాయుల సన్మాన సభ నిర్వహించారు. విద్యా, సమాజ సేవలో ఉపాధ్యాయుల అంకిత భావాన్ని గౌరవిస్తూ అంగన్‌వాడీ టీచర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సహాయ కార్యదర్శి గోంత్యాల శ్రీనివాస్, శ్రీ గాయత్రీ పొదుపు సంఘం మాజీ అధ్యక్షులు కుడికల గణమ్మ, ఉపాధ్యక్షులు దాశపతి భిక్షపతి, నాయకులు దొంత రాజు, గంజి రాజు, నరేష్‌యాదవ్, సామల యాదయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రూట్స్ కాలేజియమ్ గ్రాడ్యుయేషన్ సెర్మెనీ

జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో శనివారం రూట్స్ కాలేజియమ్ గ్రాడ్యుయేషన్ సెర్మెనీ వేడుకలు జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర హాజరై విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు. – జూబ్లీహిల్స్,అక్టోబర్ 5

చిరు వ్యాపారులకు అండగా ఉంటాం

చిరు వ్యాపారులతో హాకర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు

ఎర్రగడ్డ, అక్టోబర్ 5: పేదరికం కారణంగా కుటుంబ పోషణ కోసం కష్టపడే చిరు వ్యాపారుల పట్ల అధికారులు, ప్రభుత్వం సహకారం అందించే విధంగా ఉండాలని నేషనల్ హాకర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు మీర్ ఇనాయత్ అలీబాక్రి అన్నారు. బోరబండలో శుక్రవారం ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించిన నేపథ్యంలో బాధిత చిరు వ్యాపారులతో ఫెడరేషన్ నాయకులు శనివారం బోరబండలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బాక్రి మాట్లాడుతూ చిన్న వ్యాపారాలకు లైసెన్సులు ఇచ్చి, రుణాలు కూడా అందజేసిన అధికారులు ఇలా ఇబ్బందులకు గురి చేయటం సమంజసం కాదన్నారు. ఏదేమైనా చిరు వ్యాపారులకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఫెడరేషన్ గ్రేటర్ అధ్యక్షుడు మహ్మద్‌అక్రమ్, బోరబండ అధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి జమీర్, ఉపాధ్యక్షుడు మూసా, రమేష్‌యాదవ్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేస్తున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు

కాచిగూడ, అక్టోబర్ 5 : ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని 13 పేద కుటుంబాలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శనివారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, హిమయత్‌నగర్ తాసీల్దార్ సంధ్యరాణితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ పాలనపై యావత్ ప్రజానీకం నీరాజనం పలుకుతున్నారని, పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేయడంలో పొరుగు రాష్ట్రాల కంటే కేసీఆర్ హయంలో తెలంగాణ మొదటిస్థానంలో ఉందన్నారు.కేసీఆర్ పాలనలో పేద ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేయడంలో దేశంలోనే రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని పేర్కొన్నారు. 28 రాష్ట్రాల్లో ఏ ప్రభుత్వం చేయలేని సాహసాన్ని మాజీ సీఎం కేసీఆర్ చేశారని, పేదల కోసం డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించి, ఉచితంగా అందజేశారన్నారు. కార్యక్రమంలో హిమయత్‌నగర్ ఆర్ఐ మధు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో..మల్లిక్‌కు ముందస్తు బెయిల్

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 5 : జానపద గాయకుడు సింగారపు మల్లేశం అలియాస్ ఎస్‌వీ మల్లిక్‌తేజకు హైకోర్టు ముందస్తు బెయిల్ ముంజూరు చేసింది. జగిత్యాల కలెక్టరేట్ సాంస్కృతిక సారథిలో ఉద్యోగి అయిన అతడిపై ఓ గాయని ఫిర్యాదు చేసింది. జగిత్యాల పీఎస్‌లో కేసు నమోదు చేశారు. ఆ రెండ్ల క్రితం ఎమ్‌వీ మ్యూజిక్ అండ్ మూవీస్ పేరుతో యూ ట్యూబ్ చానల్ ప్రారంభించామని, మూడేండ్ల క్రితం నుంచి పలుమార్లు లైంగికదాడికి పాల్పడినట్టు ఫిర్యాదులో పేర్కొంది. పెండ్లి చేసుకోవాలని ఫోన్ చేసి బెదిరించేవాడని, డబ్బులు ఇవ్వడం లేదని ఫిర్యాదులో వివరించింది. రెండు రకాల ఫిర్యాదులు చేసినట్టు న్యాయవాది లక్ష్మణ్ వాదనల్ని వినిపించగా ఏకీభవించిన హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. రూ.25వేల చొప్పున ఇద్దరి పూచీకత్తులను జమానత్ గా జగిత్యాల టౌన్ పీఎస్‌లో సమర్పించి అధికారి ఎదుట లొంగిపోవాలని ఆదేశించింది.

వైభవంగా బతుకమ్మ సంబురాలు

ఎస్‌పీఆర్ హిల్స్ గ్రౌండ్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకలలో పాల్గొన్న మేయర్ విజయలక్ష్మి

ఎంజీఐటీలో బతుకమ్మ ఆడుతున్న అధ్యాపకులు, విద్యార్థినులు

మణికొండ, అక్టోబర్ 5: పువ్వులని దైవంగా భావించి పూజించే పండుగ బతుకమ్మ అని ఎంజీఐటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. గండిపేట్‌లోని మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఆవరణలో బతుకమ్మ ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. వివిధ విభాగాలకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు ప్రిన్సిపాల్ బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బండ్లగూడ : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విజ్ఞాన్ కళాశాలలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గౌరీ సతీశ్ పాల్గొని బతుకమ్మ పండుగ విశేషాలను విద్యార్థులకు తెలిపారు.

ఖైరతాబాద్ : తెలంగాణ భవన్‌లో జరిగిన బతుకుమ్మ సుంబురాల్లో ఖైరతాబాద్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి, వేంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ మన్నె కవితా రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ : రాత్రి రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్‌పీఆర్ హిల్స్ గ్రౌండ్‌లో కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలలో నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి పాల్గొని బతుకమ్మ ఆడారు. కాంగ్రెస్ నాయకుడు నవీన్ యాదవ్ పాల్గొన్నారు.

విజ్ఞాన్ కళాశాలలో జరిగిన బతుకమ్మ ఉత్సవాలలో విద్యార్థులతో చైర్మన్ గౌరి సతీశ్

తెలంగాణ భవన్‌లో జరిగిన బతుకుమ్మ సుంబురాల్లో ఖైరతాబాద్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి, వేంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

గుమ్మకొండ కాలనీలో ప్రజల నుంచి వివరాలు సేకరిస్తున్న ఉపకమిషనర్ రవికుమార్

పకడ్బందీగా డిజిటల్ సర్వే

జూబ్లీహిల్స్/ మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 5: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ప్రభుత్వ పథకాలకు అర్హులను గుర్తించి వారికి మెరుగైన సేవలు అందిస్తామని రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ సర్కిల్-11 ఉపకమిషనర్ రవికుమార్ అన్నారు. అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలోని గుమ్మకొండ కాలనలో డిజిటల్ ఫ్యామిలీ కార్డుల సర్వేను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ ప్రజల నుంచి వారి వివరాలను సేకరించి నమోదు చేయించారు. అనంతరం మాట్లాడుతూ.. ఒకే కార్డులో ప్రభుత్వ పథకాలు అందించేందుకు డిజిటల్ ఫ్యామిలీ కార్డును తీసుకురానుందన్నారు. ఇంటికి వచ్చే సిబ్బందికి ప్రజలు తమ వివరాలను తెలపాలని కోరారు.

జూబ్లీహిల్స్ : తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం నిర్వహిస్తున్న ఫ్యామిలీ డిజిటల్ సర్వే పకడ్బందీగా చేపట్టాలని జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా అధికారులను ఆదేశించారు. శనివారం యూసుఫ్‌గూడ లక్ష్మీనరసింహనగర్‌లో ఇంటింటి సర్వేలో పాల్గొని వివరాలు సేకరించారు. అన్ని సేవలను ఒకే కార్డుపై అందించే ఈ కుటుంబ డిజిటల్ కార్డు కోసం అధికారులు నిర్ధేశిత గృహాలకు వెళ్లి ఆయా కుటుంబ సభ్యుల వివరాలు సేకరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో యూసీడీ డీపీఓ వెంకట కిషన్‌రావు, ఏఎంసీలు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు, కమ్యునిటీ ఆర్గనైజర్లు, రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

నగరంలో ఆబ్కారీ దాడులు

ముగ్గురు వ్యక్తుల అరెస్ట్.. రూ.2లక్షల విలువైన గంజాయి సీజ్

సిటీబ్యూరో, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ అధికారులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.2లక్షల విలువచేసే 34గ్రాముల ఓజీ కుష్(అమెరికన్ గంజాయి), 3.230కిలోల సాధారణ గంజాయితో పాటు ద్విచక్రవాహనం, ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌టీఎఫ్ సీఐ చంద్రశేఖర్‌గౌడ్ కథనం ప్రకారం.. ఖమ్మం ప్రాంతానికి చెందిన దాండి దీపక్ కుమార్, తుమ్మల భానుతేజారెడ్డిలు ఏపీ, ఒడిశాతో పాటు విదేశాల నుంచి కూడా గంజాయి తీసుకువచ్చి రాష్ట్రంలోని వ్యాపారులకు సరఫరా చేసున్నారు. ఈ క్రమంలోనే దీపక్, భానుతేజారెడ్డి సూచనల మేరకు వరంగల్‌కు చెందిన దుర్గ్యాల రాజ్‌కుమార్, పాత వర్షిత్, సూర్య నగరంలో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్ తన సిబ్బందితో కలిసి బంజారాహిల్స్ రోడ్‌నం.36 గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న రాజ్‌కుమార్, వర్షిత్, సూర్యలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.2లక్షల విలువ చేసే 34గ్రాముల ఓజీ కుష్(అమెరికన్ గంజాయి), 3.230కిలోల సాధారణ గంజాయితో పాటు ద్విచక్రవాహనం, ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఆబ్కారీ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు జరిపిన ఈ దాడుల్లో ఎస్‌టీఎఫ్ ఎస్ఐ శ్రీనివాస్, కానిస్టేబుళ్లు శ్రీకాంత్, ప్రసాద్, కమాలేశ్ తదితరులు ఉన్నారు.

ఉపాధి కల్పనకు ప్రభుత్వం చర్యలు

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 5 : తెలంగాణలో ఉపాధి కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. శంషాబాద్ పట్టణంలో బీఆర్ఎస్ హయాంలో మంజూరైన నిధులు రూ. 5 కోట్లతో నూతనంగా నిర్మించిన మున్సిపల్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, వైస్ చైర్మన్ గోపాల్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మహిళా సంఘాలకు చెందిన సభ్యులకు ప్రత్యేక రుణాలు ఇవ్వడంతో పాటు వారు స్వయంగా వ్యాపారం చేసుకునే విధంగా ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ నూతన మున్సిపల్ కార్యాలయం నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ శశాంక, ఆర్డీవో వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీవరేజీ సమస్యను పరిష్కరించండి

జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి శనివారం పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఖైరతాబాద్, ఏసీ గార్డ్స్, ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్‌లలో పర్యటించి సీవరేజీ సమస్య పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సీబీఐ కాలనీ, బడా గణేశ్, సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ నుంచి ఐమాక్స్.. ఎన్టీఆర్ గార్డెన్ ఎదుట రహదారిపై ఉన్న ఏ ట్రంక్ మెయిన్‌లోకి చేరుతున్న సీవరేజీ లైన్‌లను అధికారులతో కలిసి ఎండీ పరిశీలించారు. ఆనంతరం గవర్నర్ దత్తత తీసుకున్న ఇందిరానగర్‌లో ఎండీ పర్యటించి కొన్ని నివాసాలకు నల్లా కనెక్షన్లకు ట్యాప్‌లు లేకుండా ఉండటం చూసి.. తప్పనిసరిగా పిట్‌ట్యాప్‌లు బిగించుకోవాలని సూచించారు. డైరెక్టర్ విజయరావు, సీజీఎం ప్రభు, జీఎం, డీజీఎం, మేనేజర్ పాల్గొన్నారు.

– సిటీబ్యూరో, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ)

ఉప ముఖ్యమంత్రి ఇంట్లో చోరీ కేసు

ఖైరతాబాద్, అక్టోబర్ 5 : ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఇంట్లో చోరీ కేసులో ఇద్దరు నిందితులను బంజారాహిల్స్ పోలీసులు పీటీ వారెంట్‌పై నగరానికి తీసుకువచ్చారు. వారిని కోర్టులో హాజరుపర్చగా, 14 రోజుల రిమాండ్ విధించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇంట్లో తోట మాలిగా పనిచేస్తున్న రోషన్ కుమార్ మండల్, అతని స్నేహితుడు ఉదయ్ కుమార్‌తో కలిసి గత నెల 24న బెడ్రూం తాళాలు పగులగొట్టి రెండున్నర లక్షల నగదు, పది గ్రాముల బంగారు, వెండి ఆభరణాలను దొంగిలించి రైల్లో పారిపోయారు. వారిని ఖరగ్‌పూర్ రైల్వే స్టేషన్‌లో అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో దొంగతనం విషయం వెలుగులోకి రాగా, బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు బంజారాహిల్స్ పోలీసులు వారిని కోర్టులో హాజరు పర్చారు.